

సచ్చిదానంద సద్గురు

# సాయివాణి

ధార్మిక, సామాజిక మాస పత్రిక

(సాయి సేవా సమితి ప్రచురణ)

సంపుటి : 16 | అక్టోబర్, 2019 | సంచిక : 5

**సంస్థాపకులు :**
**శ్రీశ్రీశ్రీ స్వామీ సత్యపదానంద ప్రభుజీవారు**

**సంస్థాపక సంపాదకత్వం :**
**శ్రీ మాతా శుకవాణి**

**ప్రధాన సంపాదకత్వం :**
**బ్రహ్మచారి శ్రీ సాయి రామచైతన్య** M.A.

**ప్రచార సారథ్యం**
**శ్రీ ఎం. సత్యనారాయణ** M.Tech.

**ప్రత్యేక సహకారం**
**డా॥ జి.చంద్రారెడ్డి** M.A, M.Ed., Ph.D
**శ్రీ వి.వి. కృష్ణారావు (సాయిశ్రీ ప్రింటర్స్)**

**సాయివాణి చందా వివరాలు**

ద్వైవార్షిక చందా. ......... రూ॥ 200/-
ఆజీవ సభ్యత్వం .......... రూ॥1000/-

**చిరునామా :-**

**సాయివాణి**
C/o **శ్రీ సాయీ సేవా సమితి ట్రస్టు**
సాయిధామం, బొమ్మల రామవరం మండలం,
యాదాద్రి భువనగిరి జిల్లా-508 126.
**Ph : 9440413455, 9848133565**

**Online Donations :**
**SRI SAI SEVA SAMITHI TRUST**
**A/c No.62002652136**
**SBI Keesara Branch,**
**IFSC Code: SBIN 0020639**

**విషయసూచిక** — **పుట సంఖ్య**

మా వాణి .................................... 2
నాకిక్కడ బాగుండలేదు .................. 6
దేవుడొక్కడే .................................. 8
మాతృమూర్తులకు మనవి ............ 10
సాయి సేవక్-శ్రీ శివనేశన్ ........... 13
వివేక ప్రబోధం ............................ 17
భోగాల అంచునే బాధలు ............ 19
మాతృసంస్థ కబుర్లు ...................... 24
సాయిధామంలో దసరా ................ 26
ఒక్కటి వదిలితే చాలు ................... 27

ఈ పత్రికలోని రచయితల అభిప్రాయాలు వారి వ్యక్తిగతమైనవి. పత్రిక యాజమాన్యానికి బాధ్యత లేదు.







# మా వాణి



**సాయివాణి పాఠకులకూ, సాయిధామం శ్రేయోభిలాషులకూ దసరా, దీపావళి పండుగల సందర్భంగా శ్రీ సాయినాథుల వారు పరిపూర్ణమైన ఆశీస్సుల నొసంగుదురుగాక!**

భారతీయులకు ముఖ్యమైన రెండు పండుగలు ఈ అక్టోబరు నెలలోనే వచ్చాయి.

ప్రతిదినం మామూలుగా అలవాటుగా జరిగే నిత్య కార్యక్రమాలతో విసుగు చెంది మానవులు నీరసించి, నిరుత్సాహపడకుండా అప్పుడప్పుడు జీవితాలలో నూతన చైతన్యాన్ని ప్రవేశపెట్టి ఉత్సాహపరుస్తాయి ఈ పండుగలు.

పిండి వంటలూ, క్రొత్త బట్టలూ, ఆట పాటలకు మాత్రమే పరిమితం కాకుండా ఈ పండుగల నిర్వహణలో దైవచింతన కూడా తప్పకుండా మిళితమై ఉంటుంది.

చేతనా చేతనమైన సర్వ వస్తువులలోనూ పరమాత్మను చూడగల అభ్యాసమే మన భారతీయ తత్త్వసారం. ఈ దసరా ఉత్సవాలలో జరిగే ఆయుధపూజ (వృత్తికి సంబంధించిన ఉపకరణాల పూజ) ఈ విషయాన్నే సూచిస్తుంది. తమ జీవికకు ఆధారభూతమైన పరికరాలను పూజించి కృతజ్ఞతను తెలుపుకోవటం భావ్యమే కదా!

ఏ ఘనకార్యం సాధించాలన్నా సమాజంలో సమైక్యత అవసరం. ఈ ఆవశ్యకతను గుర్తించిన పూర్వ ఋషులు పండుగల సందర్భాలలో కొన్ని ఆచారాలను నిర్దేశించారు. విజయదశమి రోజున ఊళ్ళోని జనమంతా

సామూహికంగా సీమోల్లంఘనము (ఊరి పొలిమేరలను దాటి బయటకు వెళ్లటం) పారువేట-పాలపిట్ట కనిపించేదాకా వెళ్లటం-(పాలపిట్టలు సాధారణగా ఊళ్లోకి రావు. ఊరి సరిహద్దుల కావల పొలాల్లో ఎగురుతూ ఉంటాయి. అంచేత వాటిని చూడాలంటే-పొలిమేర దాటాల్సిందే! (ఇప్పటి రోజుల్లో దీని భావం తెలియక పంజరాల్లో బంధించి తెచ్చిన పాలపిట్టల్ని డబ్బులు చెల్లించి, దర్శించి ధన్యమైనామనుకుంటున్నారనుకోండి). ఆపైన ఊరి బయట స్మశానానికి సమీపంగా ఉండే జమ్మిచెట్టు (శమీ వృక్షం)ను సామూహికంగా పూజించటం. ఆ సమీపంలో రామ విజయానికి ప్రతీకగా రావణాసురుని బొమ్మను తగులబెట్టి-అధర్మాన్ని నాశనం చేసి విజయం పొందుతున్న ధర్మం వైపు నిలబడిన ఆనందాన్ని పొంది నిత్యజీవితంలో కూడా ధర్మ పక్షాన్ని వహించాలని ప్రతిన బూనటం-ఇవన్నీ కూడా సామాజిక స్పృహనూ, ధార్మిక చింతననూ పెంచేవే.

శమీపూజ సందర్భంగా - ఆ వృక్షానికి ప్రదక్షిణ చేస్తూ

"శమీ శమయతే పాపం, శమీ శత్రువినాశనీ

అర్జునస్య ధనుర్ధారీ, రామస్య ప్రియదర్శినీ"

అంటూ ధర్మస్థాపకులైన మన పూర్వ పురుషుల విజయాలను స్మరిస్తాము. శ్రీ సాయినాథుల వారు 1918వ సంవత్సరంలో ఈ విజయదశమినాడే సీమోల్లంఘనం చేసారు. అంటే 100 సంవత్సరాలపాటు భక్తులను అనుగ్రహించటానికి ధరించిన భౌతిక కాయాన్ని వదలి సర్వాంతర్యామిగా మాత్రమే నిలచిన రోజు. ఆ విధంగా సాయీ భక్తులకు మరీమరీ ప్రత్యేకమైన రోజు ఈ విజయదశమి.

ఆయుర్వేద వైద్య శాస్త్రరీత్యా జమ్మిచెట్టు గాలి శ్వాసకోశ వ్యాధుల్ని నిర్మూలిస్తుంది. కుష్ఠువ్యాధి నివారణకు గూడా ఈ వృక్షపు బెరడు ఉపయోగపడుతుంది.





ఆ ఈ పండుగల తిథులను నిర్ణయించటంలో మానవ మనస్సుల మీద ప్రభావం చూపంచే గ్రహగతులూ, మన జీవన మూల్యాలకు ఆదర్శ ప్రాయులైన మహనీయమూర్తులకు చెందిన పురాణగాథలు ఆధారంగా ఉంటాయి.

విజయదశమి సందర్భంగా నిర్వహించే దేవీ నవరాత్రులలో ప్రధానంగా మహిషాసుర మర్దని - ఆ ఆదిశక్తి ఆరాధన - అంటే దుష్టశక్తులను అణచి ధర్మరక్షణ చేసి ధార్మికశక్తి ఆరాధన జరుగుతుంది.

మనలోనే దుష్ట భావనలూ, సద్భావనలూ కలగాపులగంగా ఉంటాయి. మనలోని సద్గుణాలను పెంచుకొని, దుర్గుణాలను అణచటానికి ప్రయత్నించాలని సూచించటమే ఈ ఆరాధన. ఈ భావన లేకుండా ఎట్టి తాంత్రిక విధానంలో ఈ ఉపాసన చేసే వారికి కొన్ని అతీంద్రియ శక్తులు రావచ్చు. కానీ వీటిని ఎటువైపు వినియోగిస్తారనేది సంశయమే.

భగవానుని జ్యోతి స్వరూపుడుగా ఆరాధించటమే దీపావళి విశిష్టత. లోక కంటకుడైన నరకాసురుడిని - సత్యభామా సహీతుడైన శ్రీకృష్ణ పరమాత్మ సంహరించి ధర్మరక్షణ చేసిన దినంగా దీపావళి పండుగను చేసుకుంటారు. ఈ పండుగ సందర్భంలో సోదరీ సోదర ప్రేమలకు గూడా ప్రాధాన్యత ఉంది. వాడవాడలా వెలుగు వెల్లువలతో నింపి జీవితాలలో వచ్చే అంధకారాన్ని తరిమివేస్తారు. మహాదాతయైన బలి చక్రవర్తి గాథతో గూడ దీనికి సంబంధం ఉంది. ఆరోగ్యరీత్యా వానలు కురిసి కురిసి చెరువులు నిండి దోమలు మొదలైన కీటకాలు ప్రబలుతున్న రోజులలో టపాసులు కాల్చటం ద్వారా కీటకనాశనియైన గంధకపు పొగను వ్యాపింప జేసి ఆరోగ్యాన్ని కాపాడుకోవటం అనే సూత్రం కూడా ఈ సందర్భంలో వినియోగపడుతున్నది.

సమర్థ సద్గురు సాయిబాబా వారి సూక్తులలో ఒక ముఖ్యమైన సూక్తి-

"గర్భంలో పిండం అడ్డం తిరిగిపోతే దాన్ని ఖండించియైనా బయటకు తీసి తల్లిని కాపాడాలి". దీనికి ప్రాచీనమైన ఉదాహరణయే నరకాసుర వధ. నరకాసుడు స్వయానా విష్ణుమూర్తికీ, భూదేవికి జన్మించినవాడే, అతడు దుష్టుడై, లోక కంటకుడై ప్రవర్తిస్తున్నపుడు ధర్మ రక్షణార్థి సత్యభామ రూపంలో ఉన్న ఆ భూదేవి నరకాసురుని వధకు కారణభూతమైంది. ధర్మ రక్షణలో మమకారానికి తావులేదు. స్వయంగా కుమారుడైనా సరే-ధర్మ దూరుడైనపుడు అతడిని నిర్మూలించవలసినదే. ఇదీ మన భారతీయ సంప్రదాయం. దీపావళి పండుగనాడు జరిపే ఉత్సవాలలో ఈ నీతిని జ్ఞాపకం చేసుకోవాలి.

"వీడు ఎలాంటి వాడైతేనేమి మన కులం వాడురా వెయ్యరా ఓటు" అనే భావన నుంచీ -

"వీడు ఎన్ని హత్యలు చేస్తే మనకేమీ! మనకు కొన్ని ఉచిత సహాయాలు చేస్తున్నాడు గదా! జై కొడదాం, పూలమాలలు వేద్దాం రండి" అనే ఈ పరిస్థితి నుంచీ బయటపడి "ధర్మం కోసం నిలబడదాం సంకుచిత స్వార్థ చింతనను వదిలేద్దాం" అని ప్రమాణం చేయాల్సిన రోజు ఈ దీపావళి పండుగ.

దేశమంతా కన్నుల పండువుగా వెలుగుతున్న దివ్యజ్యోతుల సాక్షిగా దేశీయులంతా "ధర్మ రక్షణకు బాసటగా నిలబడతాం" అని బాస చేయుదురు గాక.

"తమసోమా జ్యోతిర్గమయ"

తథాస్తు

"లోకాస్సమస్తాః సుఖినో భవంతు"





# నాకిక్కడ బాగుండ లేదు

## పారంపరిక గాథ

అనగనగా ఒక ఊళ్లో ఒక చిన్న మాంసం వ్యాపారి ఉండేవాడు. అతడు మంచి భక్తుడు. అందరితో స్నేహంగా, ప్రేమతో కలసిమెలసి ఉండేవాడు. అతని వృత్తి కసాయి పని అయినా మనసు మాత్రం ఎంతో మంచిది. మాంసం కొనడానికి వచ్చి పోయే వారందరితో భగవంతుని గూర్చి చెప్తూ ఉండేవాడు. నిరంతరం భగవన్నామం చెప్తూండేవాడు.

ఒకరోజు అతనికి నది ఒడ్డున ఒక సాలగ్రామం (విష్ణుశిల) దొరికింది. అదేమిటో అతనికి తెలియకపోయినా ఎందుకో నచ్చింది. తీసుకువచ్చి తన దుకాణంలో పెట్టాడు. అది సరిగ్గా అరవీశె బరువుంది. అంచేత కసాయివాడు ఆ సాలగ్రామాన్ని తూకం రాయిలాగా వాడుకోవటం ప్రారంభించాడు. అదేం రాయో అతనికి తెలియదుగాని రోజూ తూకం రాళ్ళతోపాటు దానిని కూడా శుభ్రంగా కడిగేవాడు. బొట్లు పెట్టేవాడు. అలా అప్రయత్నంగానే సాలగ్రామ పూజ జరిగిపోతూండేది. సహజంగానే భక్తుడు కావటం వలన కీర్తనో, భజనో, నామమో నాలుక మీద నడుస్తూనే ఉండేది.

కొన్నాళ్లిలా గడిచాక ఒక బ్రాహ్మణుడు ఆ త్రోవ వెంట వెడుతుండగా దుకాణంలోంచి మురికినీళ్లు విసిరిపారబోస్తుంటే ఆ సాలగ్రామ శిల పొరపాటున జారి వీధిలోకి పడింది. అదీ సరిగ్గా ఆ బ్రాహ్మణుడి ముందే పడింది. అతడు బాగా శాస్త్రాలూ అవీ చదువుకున్నవాడు. చూస్తూనే సాలగ్రామాన్ని గుర్తించాడు. దాన్ని విసిరివేసిందెవరోనని చుట్టూ చూచాడు. తన కొట్లో పనిచేసే కుర్రవాడు మాంసం కడిగిన మురికినీరు అలా వీధిలోకి విసరటం, తూకం రాయి పోయి పెద్దమనిషి ముందరపడటం చూసి కంగారుపడుతూ వచ్చి నమస్కరించాడు కసాయివాడు.

"పిల్లవాడు తెలవక చేసాడు బాబూ! క్షమించండి రాయిగాని తమరికి తగల్లేదు" గదా అన్నాడు నమస్కారం చేస్తూ.

"లేదులేగానీ, యీ రాతితో నువ్వు మాంసం తూస్తున్నావా?" అని అడిగాడు బ్రాహ్మణుడు. అవునని కసాయివాడు చెప్పగానే చాలా బాధపడుతూ బ్రాహ్మణుడు దాని శక్తి, మహిమ వివరించి చెప్పాడు. "దేవాలయాలలోని శక్తి తరిగిపోతే యీ సాలగ్రామ శిల నుంచి శక్తి ప్రసరింప జేస్తారు" అని చెప్పాడు. అది వినగానే కసాయివాడు చాలా పశ్చాత్తాపపడి కన్నీళ్ల పర్యంతమయ్యాడు. "నాకు తెలీదు బాబయ్యా! ఏదో నదిలో దొరికింది బాగుంది రాయి అనుకున్నానంతే! చాలా అపచారం జరిగిపోయింది. స్వామీ!" అన్నాడు.

"సరే! జరిగిందేదో జరిగిపోయింది. ఆ సాలగ్రామాన్ని పాలతో శుద్ధి చేసి నాకివ్వు మా పూజాపీఠం పైన ఉంచుతాను" అన్నాడు బ్రాహ్మణుడు. సరేనని యిచ్చేసాడు కసాయి.

ఇప్పుడు సాలగ్రామ శిల బ్రాహ్మణుడి పూజాపీఠంపైన ఉంది. సుప్రభాతాలూ, అభిషేకాలు, పూజలు, హారతులు, నైవేద్యాలు, పవళింపు సేవలు అట్టహాసంగా అన్ని అర్చనలూ జరుగుతున్నాయి. స్వామి వారిని పూలతోనూ, అగరధూపాలతోనూ ముంచెత్తుతున్నాడు బ్రాహ్మణుడు. అలా కొన్ని నెలలు గడిచాయి. ఒకనాటి రాత్రి అతనికొక కల వచ్చింది. అందులో శ్రీమహావిష్ణువు దర్శనమిచ్చాడు. బ్రాహ్మణుడు ఎంతో సంతోషంతో కలలోనే స్తోత్రం చేసాడు. విష్ణుమూర్తి ఆ స్తోత్రం విని యిలా అన్నాడు.


"చూడు నాయనా, నీవు చాలా గొప్ప భక్తుడివే సందేహం లేదు. కానీ, నువ్వు నాకు భక్తుడవు కావు- నీ పూజా విధానానికీ, నీ భజనలకూ, స్తోత్రా లకూ భక్తుడివి. వాటిని ప్రేమించినట్లుగా నీవు నన్ను ప్రేమించలేవు. ఆ కసాయి వాడి దగ్గర్నుంచి నన్నెందుకు తీసుకువచ్చావు? అతనికి శ్లోకాలు రావు-మంత్రాలు రావు-పూజలు, పునస్కారాలు రావు. అయినాగానీ, అతని హృదయం ప్రేమమయం. ఎంతో మెత్తని మాటలు, సదా చిరునవ్వుతో





ఉండే ముఖం. చక్కని అతిథి సేవ. వృత్తి కఠినమైనదీ, క్రూరమైనదీ అయితేనేం! అతడు వచ్చే పోయే వారితో మాట్లాడే తీరు ఎంత మధురంగా ఉంటుంది. నా కథలు చెప్పటంలో ఎంత పారవశ్యం చెంతుదాడు! నా నామం పలుకుతుండగానే అతని గుండెలో ఎంతటి మెత్తదనం, ఎంతటి ఆనందం! నన్ను కేవలం తూకపురాయిగానే భావించాడు. అయినా సరే పట్టుకోవటంలో ఎంత ప్రేమ, ఎంత మృదుత్వం!

నువ్వేమో ఏ భావనా లేకుండా యాంత్రికంగా అభిషేకాలు చేస్తున్నావు. మంత్రాలు చదువుతున్నావు. అదంతా పెద్ద రొదలాగా వినపడుతోంది నాకు. విసుగుపుడుతోంది. ప్రేమలేని పూజలు నాకు అక్కర్లేదు. ప్రేమస్పర్శతోనే నా గుండె పులకిస్తుంది. నాకు కసాయివాడి దగ్గరే బాగుంది. నన్నక్కడికే పంపించు" అన్నాడు. బ్రాహ్మణుడికి తన పొరపాటు అర్థమై తలవంచు కున్నాడు.



# దేవుడొక్కడే!

- దివ్య జ్ఞానామృతం

శ్లో॥ అచింత్యాఽవ్యక్త రూపాయ, నిర్గుణాయ గుణాత్మనే ।
సమస్త జగదాధార మూర్తయే బ్రహ్మణే నమః ॥

సకల చరాచర ప్రపంచానికి మూలాధారమైన ఏదో ఒక శక్తి వుందని మనందరం విశ్వసిస్తున్నాం. ఆ అద్భుత చైతన్యశక్తియే సృష్టి, స్థితి, లయాలకు ప్రధాన కారణమని తెలుస్తుంది. మన ప్రమేయం, ప్రయత్నాల్లేకుండానే సర్వకార్యాలు జరుగుతున్నాయి. కొన్ని అనుకూలాలైతే, మరికొన్ని వ్యతిరేకాలవుతున్నాయి. ఇట్టి విషయాలు మనం సమగ్రంగా తెలుసుకునే లోపే మన జీవితకాలం పూర్తవుతుంది. ఇది ప్రస్తుతం మనం అనుభవిస్తున్న నిత్యసత్యం.

వేదాలు, వేదాంగాలు, శాస్త్రాలు, పురాణాలు, ఇతిహాసాలు, సకల మతాలు, మహర్షులు, మహాత్ములందరు బోధనల సారం బ్రహ్మమొక్కటే.

మన మనస్సుకు, వాక్కుకు అందని దివ్యమైన చైతన్యశక్తినే గుర్తుగా 'పర బ్రహ్మం' అని పిలుస్తున్నారు. ఆ పరబ్రహ్మం ఈ సృష్టి అంతా అణువణువునా నిండి ఉంది. అంతేగాక సృష్టిలోని సకల ప్రాణికోటి హృదయాంతరాళంలో సూక్ష్మాతిసూక్ష్మంగా చైతన్యస్వరూపంగా వుంది. మన వెలుపల అంతటా నిండి వున్న 'పరబ్రహ్మం' మన లోపల దాగియున్న పరబ్రహ్మం ఒక్కటే. ఇపుడిక ఆ పరబ్రహ్మం లేని స్థానమే లేదు. దీన్నే 'దేవుడు' అన్నారు.

ప్రస్తుతం మన 'దేవుడు' అన్న పదాన్ని మనకు కనిపించే దేవతా మూర్తులను పిలుస్తున్నాం. ఈ దేవతా మూర్తులందరికి ఆ పరబ్రహ్మమే దేవుడు. అందుకే ఆయన దేవాదిదేవుడవుతాడు. ఇక్కడ ఒక్కటే చిన్న తేడా గమనించాలి మనం. పరబ్రహ్మానికి నామ, రూపాలు లేవు. ఇతర దేవతా మూర్తులందరికీ నామ, రూపాలున్నాయి. అంతేగాదు గుణ, లీలాదులు కూడా వున్నాయి.

మన భౌతిక నేత్రాలకు కనిపించని దేవాదిదేవుడైన పరబ్రహ్మాన్ని తెలి యుటకు ఈ నామ, రూప, గుణ, లీలాదులున్న దేవతామూర్తులను ఆశ్ర యిస్తున్నాం. సాధనకు ఉపయోగిస్తున్నాం. ప్రధానంగా దేవుడొక్కడే అయినా మన కొరకు విభిన్న రూపాల్లో, వివిధ నామాలతో అనేకమంది దేవతలై నారు. మన సాధనాస్థితిననుసరించి, దేశ, కాల, యుగ పరిస్థితుల ప్రకారం ఆయా దేవతలను మనం సేవిస్తున్నాం.

పరబ్రహ్మాన్ని తెలియుటకు జ్ఞానమొక్కటే పరమ సాధనం. ఇది కేవలం జీవరాశులన్నింటిలో మనకే సాధ్యం. మన జన్మ చరితార్థమగుటకు ఇది తప్ప వేరే మార్గం లేదు. అందరికీ ఇది సులభంగా సాధ్యం కాక పోవచ్చు ననే ఉద్దేశ్యంతో మన మహాత్ములు ఎన్నో మార్గాలను సూచించారు. ఎవరెవరి అనుకూలతను, స్థాయిని అనుసరించి, వారు ఆయా మార్గాన్ని ఎంచుకోవచ్చు. జీవితకాలంలో లక్ష్యాన్ని సాధించడమే ప్రధానం.

"సర్వేజనాః సుఖినోభవంతు"







# మాతృమూర్తులకు మనవి

- శ్రీ మాధవరావు గోళ్వల్కర్ గురూజీ

(పాంచజన్యం నుండి)

(గత సంచిక తరువాయి)

యుద్ధానికి పోబోయే ముందు, పంచ పాండవులూ కుంతి ఆశీస్సు లను గోరవచ్చినపుడు ఆమె పల్కిన పల్కులను వీరత్వానికి గుర్తులుగా చెప్పకోవచ్చు.

యదర్థం క్షత్రియా సూతే తస్యకాలోయ మాగతః।
నహి వైరం సమాసాద్య సీదంతి పురుషర్షబాః ॥

(ఎందుకు క్షత్రియ కాంతలు పురుష సంతానాన్ని కంటారో ఆ శుభ ఘడియ ఆసన్నమయింది. వీర సింహాలు శత్రువులు ఎదురైనంత మాత్రాన నీరు కారిపోరు.)

సరయిన విలువలను ముద్రించండి

మహాభారతంలో మరొక శ్లోకం ఉంది.

"ఎవరు మౌనంగా అవమానాన్ని సహించి పడివుంటాడో, ఎవడు తేజో పౌరుష సామర్థ్యాలను కలిగివుండడో, ఎవడు శత్రువులకు సంతో షాన్ని కలిగిస్తాడో అట్టి కుమారుని ఏ తల్లీ ప్రసవించకుండుగాక" అన్నది ఆ శ్లోకార్థం.

ఇంక మన విషయాలన్నిటి మీద జాతీయ స్వాభిమానపు ప్రభావం ముద్రలు పడాలి. ఇంట్లో నిత్యావసర వస్తువులన్నీ స్వదేశీవే ఉపయోగిస్తా నని ప్రతిజ్ఞ స్వీకరించండి. అదే మొక్కవోని జాతీయ సౌశీల్యాన్ని మనలో కలిగిస్తుంది.

పాశ్చాత్య నాగరికతా వ్యామోహం గొడ్డలిపెట్టు. పైపై మెరుగులను అనుక రించే అలవాటు ఇచట జన్మించిన ఆడపడచు లలవరచిన అభిజాత్యపు

సంప్రదాయాలూ, సౌశీల్యాలకు వినాశకారి!

అచంచలమైన సత్యనిష్ఠకూ, వన్నెకెక్కిన సౌశీల్యానికి హిందువు ప్రసిద్ధి పొందాడు. కానీ ఈ రోజుల్లో మన పెద్ద నాయకులు కూడ వారి యొక్క నైతిక పతనాల కారణంగా అప్రతిష్ఠ పాలయ్యారు. ఇట్టి వినాశకమైన ప్రభావాల నుండి మన భావితరాన్ని కాపాడటం మన మాతృమూర్తుల చేతుల్లో ఉంది.

అవినీతికి పాల్పడి తృప్తి పొందటానికంగీకరించే కన్నా సంతోషంగా ఒక పూట పస్తుండేందుకైనా సిద్ధపడే వాతావరణాన్ని వారు నిర్మించవలసి ఉంటుంది. అవినీతిగా సంపాదించబడిన పాపిష్ఠికూటిలో తామెవ్వరూ ఒక మెతుక్కూడా తినమని కుటుంబమంతా ప్రతిజ్ఞ బూనాలి.

మన మాతృమూర్తులు వారి పిల్లలలో అటువంటి ఉదాత్తము, పౌరుషోపేతమునైన స్వభావాలను అలవరిస్తే రాబోయే తరాలు తప్పకుండా మన దేశం ఎదుర్కొంటున్న వివిధ సమస్యలను విజయవంతంగా ప్రతిఘటించగలవు.

**సాంఘిక సామరస్యమే నశిస్తే**

ఇక - సమాజం పట్ల మన ధోరణి ఏమిటీ? అన్న ప్రశ్న ఒకటి వుంది. వ్యక్తిగత, కౌటుంబిక జీవితాల యొక్క భద్రత, సౌఖ్యములు సమాజం యొక్క సంక్షేమం మీదనే ఆధారపడి ఉన్నాయనే విషయం స్పష్టమే. నిజంగా సామాజిక శాంతి భద్రతలు లేనపుడు వ్యక్తుల యొక్క నైతిక, ఆధ్యాత్మిక పురోగతి ఎన్నో అడ్డంకుల్ని ఎదుర్కోవలసి వస్తుంది.

సమాజం కనుక విఛ్ఛిన్నమైపోతే ఆధ్యాత్మికంగా మహోన్నతులైన వారు కూడ బ్రతికి బట్టకట్టడం కష్టసాధ్యమవుతుంది. అందుచేత సామాజిక జీవితం సరిగా ఉండేట్లు చూసుకోవడం మన ముఖ్య కర్తవ్యం.

మన సామాజిక జీవితాన్ని సవ్యంగా, స్వతంత్రంగా, స్వాభిమాన పూర్ణంగా నిలుపుకోవాలనే, ఈ అంశాన్ని మనం యింతకుముందు విస్మరించాం. సమైక్య సమాజంగా జీవించటం మరచిపోయాం. అద్భుతమైన మానవశక్తి మనకు ఉన్నప్పటికీ "నేను ఒంటరివాణ్ణనే" భావానికి మనం బానిసలమైపోయాం.





ఒకప్పుడు నాగపూర్‌లో 20,000 మంది పాల్గొన్న బ్రహ్మాండమైన బహిరంగ సభ జరిగింది. అకస్మాత్తుగా ఎవడో ఒకడు "ఓ! వాళ్లు వచ్చారు" అని కేకపెట్టాడు. మరుక్షణం ఆ విశాల జన సమూహం భయంతో త్రొక్కిసలాడుకుంటూ పారిపోసాగారు.

అలా పారిపోతున్న ఒక మనిషిని ఒకాయన ఏం జరిగిందని ప్రశ్నించాడు అతడు "నాకు తెలియదు, అందరూ భయపడి వెళ్ళిపోయారు-నేనూ పారిపోతున్నాను" అన్నడు.

కానీ, నీవు నిలబడి ఇదంతా ఏమిటి? ఎందుకు జరుగుతోందని విచారించలేదా? అన్న ప్రశ్నకు "నేనేం చేయగలను? నేను ఒంటరిగాణ్ణి" అని అతడు బదులుచెప్పాడు.

వాస్తవమయిన యజ్ఞం

ఒకే తల్లి సంతానమైన కారణం చేత పరస్పర సుఖదుఃఖాలలో మనం పాలు పంచుకోవాలి, అన్న సమైక్య భావన లేకపోయినందుకు ప్రతిఫలమిది. సమాజం పట్ల మన ప్రేమాభిమానాలను ఒక నిర్దిష్టమైన రూపంలో మనం ప్రకటించాలి.

ఉదాహరణకు - మన సమాజంలో నిత్య భోజనానికి నోచుకోని వారెందరో ఉన్నారు. వారి కొరకు మనం ఆవేదన పడుతున్నామా? వారికి ఎంతో కొంత సహకరించాలని మనం ప్రయత్నం చేస్తున్నామా?

పూర్వకాలంలో బీదలకూ, ఆకలిగొన్నవారికీ ముందుగా కడుపు నింపిన పిమ్మట ఇతరులకు ఆహారమిచ్చే "బలి వైశ్వదేవ యజ్ఞం" అని ఒకటి ఉండేది. ఈనాడు సమాజంలోని అన్నార్తులను పోషించటానికి ప్రతినిత్యం కనీసం గుప్పెడు గింజలను విడిగా తీసి ఒకచోట బెట్టి ఆపైన మాత్రమే అన్నం తీసుకోవాలి. ఈ పని మనం చేయగలం-చేసి తీరాలి కూడ. అది మాత్రమే నిజమైన బలి వైశ్వదేవ యజ్ఞం కాగలదు.

**(సశేషం)**

## సాయి సేవక్

# శ్రీ శివనేశన్ స్వామీజీ జీవిత చరిత్ర

**(గత సంచిక తరువాయి)**

స్వామీజీ చాలాకాలం వరకు ఒక తుండును కట్టుకుని మరొక తుండును తలపాగాగ ధరించెడివారు. శరీరముపై చొక్కాగానీ, కనీసం బనీనుగానీ ధరించెడివారు కాదు. వయస్సు మీరిన తరువాత స్వామీజీని తరచూ ఆస్తమా బాధించుటచే వైద్యుల సలహాపై ఖద్దరు బనీను ధరించుట మొదలుపెట్టెను. ఒకనాడు బొంబాయి నుండి ఒక భక్తుడు సాయి దర్శనార్థమై షిరిడీకి వచ్చి తాను రోజు ఒక భక్తునికి భోజనమేర్పాటు చేయదలంచి అందుకుగాను కొంత పైకాన్ని సమాధి మందిర పూజారిగా పనిచేస్తున్న ఉద్ధవరావు దేశ్‌పాండే గార్కి సమర్పించెను. స్వామీజీ అంత పిన్న వయస్సులోనే ఎంతో పరిణితి చెందిన వ్యక్తులకన్నా మిన్నగా సాయి సేవ చేస్తూ, ఆ సేవకే తన జీవితాన్ని అంకితము చేసిన స్వామీజీకన్న మిన్నయైన భక్తుడు లేడని తలంచి బొంబాయి భక్తుడు సమర్పించిన ధనముతో భోజనాన్ని బాబాకు నివేదించి దానిని స్వామికి ఇచ్చేవారు. ఆనాటి నుండి అదే ఆచారంగా మారి స్వామి సమాధి చెందేవరకూ సాయికి నివేదించిన ప్రసాదాన్ని స్వామికి ప్రసాదించేవారు షిరిడీ సాయి సంస్థాన్ వారు. స్వామీజీకి పూర్వముగాని స్వామి సమాధి చెందిన తరువాత గాని ఈ అదృష్టము మరియొక భక్తునకు కలుగలేదంటే బాబాకు స్వామిపై ఎంతటి ఆదరాభిమానాలున్నవో చదువరులు గ్రహింతురుగాక. ఈ విధముగా స్వామీజీకి ఆకలి ఆమడదూరమాయెను. ఏ చీకూ చింతా లేక స్వామీజీ తన పూర్తికాలాన్ని సాయి సేవకే అంకితమొనరించి ప్రశాంత జీవనము కొనసాగించెను.

ఒక పర్యాయం స్వామీజీకి ద్వారకామాయిలో పడమర కుడ్యమునకు



సాయి వాణి

గల బాబా బండపై ఆశీనుడైన ఛాయాచిత్రంలో ముప్వురు వ్యక్తులు దర్శన మిచ్చారు. అందులో ఒకరు లక్ష్మీనాథ్ జటాశంకర్ త్రివేది. ఈయనను స్వామీజీ ప్రథమంగా ఖండోబా మందిరం చెంత కలుసుకున్నారు. బాబా పటంలో అగుపించిన వ్యక్తి కళ్లెదుట కనిపించేసరికి స్వామి ఆశ్చర్య భరితులై ఆయనకు నమస్కరించి పరిచయం చేసుకున్నారు. ఇరువురూ అకుంఠిత సాయి భక్తులగుటచే అనతికాలమందే మంచి మిత్రులయ్యారు. త్రివేది నూట ఎనిమిది పర్యాయములు షిరిడీకి వచ్చి బాబాను దర్శించుకునెను. ప్రతి పర్యాయము తనతో భక్తులను షిరిడీకి తీసుకువచ్చి వారికి బాబా లీలను వివరించుట, షిరిడీలోని పవిత్ర ప్రదేశాలను చూపించుట చేసి వారిలోని సాయి భక్తిని పెంపొందించేవారు. బీదలకు విరివిగా అన్న దానము, వస్త్ర దానము చేసేవారు. ధునికి సమర్పించడానికి ఆవు నెయ్యి, సాంబ్రాణి, అగరువత్తులు మొ॥ దీపాలు వెలిగించడానికి నూనె, స్వామీజీకి వస్త్రములు, ఆధ్యాత్మిక గ్రంథాలను సమర్పించేవారు. ఒకసారి ఈయన పెద్ద డబ్బా నిండా నూనెను తెచ్చి స్వామీజీకి ఇచ్చి ద్వారకామాయిలో దీపాలు వెలిగించమని కోరారు. ఆరోజు ఆ నూనెతో ద్వారకామాయిలో బాబా సశరీరులుగా ఉన్నప్పుడు వెలిగించే దీపాల సంఖ్యకు తగ్గకుండా ద్వారకామాయి మొత్తం దీపాలతో అలంకరించగా అది గాంచి భక్త వరేణ్యులు ఆ రోజు దీపావళిని మరిపించినదని ఆనందభరితులయ్యారు. మరొకసారి త్రివేదిగారు స్వామీజీకి అతి విలువైన నూతన వస్త్రాలను సమర్పించగా నిరాడంబరముగా జీవితమును సాగించే స్వామీజీ ఆ వస్త్రములను ధరించుటకు మనస్సంగీకరించక వాటిని ఒక ఫకీరుకు సమర్పించారు. ఆ ఫకీరు ఆ వస్త్రములను ధరించి అక్కడకు అతి సమీపమున పారాయణ చేసుకుంటున్న త్రివేది చెంతకేగెను. ఆ ఫకీరును గాంచిన త్రివేది ఆ వస్త్రములను తాను శివనేశన్ స్వామికివ్వగా ఆ ఫకీరు దగ్గరకు ఎలా వచ్చినాయని ఆలోచించుచుండగా ఆ ఫకీరు "నీవు నాకు

చాలాకాలం నుండి తెలుసు. ఈ వస్త్రాలను నీవు శివనేశన్‌కు సమర్పించినవే" అని చెప్పి అచట నుండి వెడలిపోయెను. అది చూచిన త్రివేది ఆ ఫకీరును తానింతకు పూర్వము చూచి ఉండకపోయినను అతను చాలాకాలం నుండి తెలుసునని చెప్పాడు. ఇదెలా సాధ్యము అని స్వామీజీ దగ్గరకు వెళ్ళి జరిగినదంతా వివరించగా స్వామీజీ వెంటనే "ఆ ఫకీరు ఎవ్వరో కాదు సాక్షాత్తూ సాయినాథుడే. లేకపోతే ఈ వస్త్రాలను నీవు నాకిచ్చావని అతని కెట్లా తెలుస్తుంది?" ఇది సాయినాథునికి తప్ప అన్యులకు అసాధ్యమని వివరించగా త్రివేది మనస్సు ఆనంద డోళికలలో తేలియాడి సాయినాథుని దర్శనమునకు కారణమైన స్వామీజీని కొనియాడి ప్రేమాభిమానములతో కౌగిలించుకొనెను. సాయి సాక్షాత్కారమునకు 'నీవంటే నీవే కారణమని' ఒకరినొకరు అభినందించుకొనిరి. ఈ సంఘటన మనం సాయినాథుని పేరిట ఎవ్వరికి ఏమి సమర్పించినా అది బాబాకే చెందునని తేటతెల్లము చేయుచున్నది గదా!

స్వామీజీకి బాబా చిత్రపటంలో అగుపించిన రెండవ సాయి భక్తుడు శ్రీ ఎం.ప్రభు. ఈయన తమిళనాడుకు చెందినవారు. ఈయన కుటుంబ సభ్యులంతా బాబాకు అనన్య భక్తులే. వీరి కుటుంబము గూర్చి కొంతలో కొంతైనను వివరించకపోతే ఈ గ్రంథము అసంపూర్ణమే యగును. ప్రభు కెమిస్టుగా ఉద్యోగము చేసెడివారు. ఈయన శ్రీమతి వారిజ తీవ్ర అస్వస్థతతో బాధపడుచుండ ఎంతోమంది ప్రముఖ వైద్యులను సంప్రదించినను ఆమెకు ఉపశమనము కలుగలేదు. మృత్యువుతో పోరాడుచు జీవితమును కొనసాగించుచుండెను. ఒకనాడు 'ది హిందూ' దినపత్రికలో పూజ్య నరసింహ స్వామీజీ కోయంబత్తూరులో 'నాగ సాయి' మందిరమునకు విచ్చేయుచున్నారనియు, సాయినాథుని అనుగ్రహముతో అసంఖ్యాక అనారోగ్యులను ఆరోగ్యవంతులుగా చేసిరనియు కూడ ప్రకటింపబడెను. చిట్టచివరి ప్రయత్నముగా ప్రభు తన శ్రీమతిని వారి చివరి సంతానమైన





చి.విన్నీని తీసుకుని నరసింహ స్వామీజీ దర్శనార్థమై కోయంబత్తూరు వెళ్ళి స్వామీజీని దర్శించి తన భార్య అనారోగ్యమును బాపుమని వేడుకొనెను. నరసింహ స్వామీజీ శ్రీమతి వారిజకు 'అచ్యుతానంద గోవింద' యను మంత్రము ఉపదేశించి దినమునకు ఇరువది ఒక్కమార్లు ఇరువది ఒక్క దినములు నిష్ఠతో పఠించమనియు, నిత్యము బాబా ఊదిని నీటిలో కలిపి తీర్థముగా స్వీకరించవలెనని సెలవిచ్చిరి. ఆమె ఆ విధముగా చేయగా ఆరోగ్యము కొంత మెరుగై అతి త్వరలోనే ఆమె సంపూర్ణ ఆరోగ్యవంతురాలయ్యెను. నాటి నుండి ఆ కుటుంబమునకు బాబా ఆరాధ్యదైవమాయెను. స్వామీజీ చేసిన ఉపకారమునకు ధన్యవాదములు చెప్పటకుగాను మరల స్వామీజీని కలవగా ఆయన చిరునవ్వుతో 'నేను నిమిత్తమాత్రుడను, చేసెడిది, చేయించెడిది అంతా బాబాయే' అని వినయముగా పలికి ప్రభూ 'నీవు మధ్య భారతదేశములో బాబా ప్రచారము చేయుము' అని సెలవిచ్చెను. అటు పిమ్మట అనతి కాలముననే ప్రభూకి మధ్యప్రదేశ్‌లో గల జబల్‌పూర్‌కు బదిలీ అయ్యెను. అచట ఉద్యోగము చేయుచునే బాబా భజనలు, సత్సంగములు జరుపుచూ బాబా ప్రచారము ప్రారంభించి బాబా భక్తుల సంఖ్య పెరగగానే ఒక బాబా మందిరమును కూడ నిర్మించి దాని నిర్వహణ బాధ్యతలు కూడ చక్కగా నిర్వహించెను.

వీరి కుటుంబమంతయు ప్రతి సంవత్సరము షిరిడీ వెళ్ళి బాబాను దర్శించి సేవించెడివారు. వీరి చివరి సంతానమైన బృంద మరియు విన్నీ కూడ వీరితో షిరిడీ వెళ్ళెడివారు. వీరు 1955వ సం.లో షిరిడీకి వెళ్ళగా స్వామీజీ ప్రభుని చూచి తనకు బాబా చిత్రపటమందు అగుపించినది ఈయనేనని గ్రహించి తనను తాను పరిచయము చేసుకొనెను. అందరు సాయి భక్తులగుటచే ఒకే కుటుంబ సభ్యులుగా కలిసిమెలసి ఉండెడివారు. ప్రభు ఆయన శ్రీమతి వారిజ స్వామీజీని తన కుమారుని వలె ఆదరించెడివారు. **(సశేషం)**



# "వివేక ప్రబోధం"

## మానవ సేవయే మాధవసేవ

- స్వామి వివేకానంద

నేను నా జీవితములో నేర్చుకొనిన అత్యుత్తమ పాఠమేమనగా - సాధ్యమునందు చూపవలసినంత శ్రద్ధను సాధించు సాధనమునందును చూపవలయుననియే....ఆ ఒకే సిద్ధాంతము నుండి నేననేక పాఠముల నెల్లప్పడు నేర్చుకొనుచున్నాను. కార్యసిద్ధికి కీలకమంతయు దానియందే- అనగా సాధ్యమునకు చూపవలసినంత శ్రద్ధ సాధనముల పట్ల కూడ చూపుటయందే కలదని నా నిశ్చయము.

ఇతరులయెడ మన కర్తవ్యము, వారికి ఉపకారమొనర్చుటే. అనగా ప్రపంచమునకు సాయపడుట. అసలు మనము ప్రపంచమునకేల సాయ పడవలయును? ప్రపంచమునకు సాయపడుటనగా నిజముగా మనకు మనము సహాయపడుటయే... ఉన్నత ప్రదేశమునందు నిలబడి చేతిలో ఐదు పైసలు పట్టుకొని "బిచ్చగాడా! ఇదుగో" అని దర్పముగా పలకవద్దు. దానికి మారుగా బిచ్చగాడు అచట నిలచినందులకు అతని పట్ల కృతజ్ఞతను చూపుము. అతనికి దానమిచ్చుటచేత నీవు నీకే ఉపకారము చేసుకొనగల్గుచున్నావు. ధన్యుడగునది ఇచ్చువాడు కాని, పుచ్చుకొనువాడు కాదు. ఆ బిచ్చగాని మూలమున నీలో కనికరముప్పొంగినది. ఆ విధముగా నీవు వినమ్రుడవు, పవిత్రుడవు, పరిపూర్ణుడవు అగుచున్నావు. ఇట్టి అవకాశము నీకు లభింపజేసినందులకు ఆ బిచ్చగానికి కృతజ్ఞుడవై యుండుము.

ఉద్రేకరహితుడు, ప్రశాంతచిత్తుడు, దయామయుడు, ప్రేమస్వభావుడు, సత్కృత్యముల నాచరించి తనకు తానెంతగానో ఉపకారమొనర్చుకొను చున్నాడు.

ఘనకార్యములను సాధించుటకు, సడలిపోని పట్టుదల ఎంతో కాలము అవసరము. కొందరు ఘనకార్యములను సాధించలేకపోయిరని మనము బాధపడనవసరము లేదు. కష్టము కలిగినప్పడు, ఘోరవిపత్తులు ఎదురైనపుడు తమలోనున్న స్వార్థ పిశాచములు గట్టిగా పోరాడుచున్నప్పడు ఆధ్యాత్మికాగ్ని వారిని బయటకు తరుముచున్నప్పడు అనేకులు పతన మగుట సహజమే!





చెరుపు చేయుట చేత, ఇతరులకేగాక, మనకు గూడ మనము హానిచేసి కొనుచున్నాము. మంచి చేయుటచేత మనకును, ఇతరు లకును, మంచి చేకూరుచున్నది. కర్మయోగము ప్రకారము జరిగిన పని, దాని ఫలితమునది యిచ్చి తీరును, దానిని నశింపజేయలేము. ప్రకృతిలో ఏ శక్తియు కర్మఫలితము నాపజాలదు, నేనొక చెడుపని చేసినచో, దాని వలన నేను బాధ అనుభవింపక తప్పదు. ఈ జగత్తులో ఏ శక్తియు దానిని నిలుపలేదు. అదే విధముగా నేనొక మంచిపని చేసినచో ఈ జగత్తులో దాని ఫలితముల నది యివ్వకుండ ఏ శక్తియు మాన్పలేదు.

సకల శ్రేయమునకు, సమస్త నీతి వర్తనమునకు సంకేత పదము "నేను" గాదు, "నీవు" స్వర్గమున్నదో లేదో నరకమున్నదో లేదో ఎవరికి కావలయును? ఆత్మయున్ననేమి? లేకున్ననేమి? మార్పులేని దొకటి ఉన్నదో లేదో ఎవరికి లెక్క? ప్రపంచము మన కట్టెదుట నున్నది, అది దుఃఖమయము. బుద్ధదేవుని వలె దానిలోనికి ప్రవేశించి దుఃఖ నివారణకై నిన్ను నీవు అంకితమొనర్చుకొనుము. ఆ ప్రయత్నములోనే మరణింపుము. నీవు ఆస్తికుడవో, నాస్తికుడవో! వేదాంతివో! కర్మరువో! క్రైస్తవుడవో! మహ మ్మదీయుడవో! ఎవరైననేమి? అది అంతయు మరచిపొమ్ము. నీవు మొట్ట మొదట నేర్వవలసిన పాఠమిది-లోకములోని దుఃఖనివారణమునకై నిన్ను నీవు సమర్పించుకొనుము.

"భగవంతుని గూర్చిన వివిధ సిద్ధాంతములను తెలుసుకొనవలయు నను చింత నాకు లేదు" అని చెప్పిన ప్రవక్త బుద్ధుడొక్కడే! "ఆత్మను గూర్చిన అనేక నిగూఢ సిద్ధాంతములను చర్చించినందువలన కలుగు ప్రయోజనమేమి? మంచి చేయుము, మంచిగా నుండుము. ఇదే మీకు మోక్షమొసగును. ఇదే సత్యమును మీచే దర్శింపజేయును" ధనముగాని, కీర్తినిగాని కోరక, నిష్కామముగా పనిచేయువాడే చక్కగా పనిచేయును. ఆ విధముగా చేయగలడేని, అతడు బుద్ధుడగుచున్నాడు. ప్రపంచమును మార్చివేయగల శక్తి అతని నుండి ఉత్పన్నమగును.



# భోగాల అంచునే బాధలు!

భక్త కబీర్ ఒకరోజు రామభజనలు పాడుకుంటూ, భుజాన జోలె కట్టుకొని వీధుల గుండా సాగిపోతూ ఉన్నాడు. ఇల్లిల్లూ తిరుగుతూ ఓ పెద్ద భవంతి ముందు నిలబడ్డాడు. అది అందమైన ఓ దేవదాసి ఆవాసం. కబీర్ 'భిక్షాం దేహీ' అనగానే, కాలిమువ్వల సవ్వడితో, కాటుక దిద్దిన కలువరేకులలాంటి కనుదోయితో ఆ దేవదాసి ఇంటి బయటకు వచ్చింది. అందానికే అర్థం చెబుతున్నట్లున్న ఆమె, పాత్రలోని భిక్షను ఆయన జోలెలో వేసింది. కబీర్ ఆమె కళ్లను అలా ఒక్కసారి చూసి, ఓ పసిబాలుడిలా చిరునవ్వుతో ఆశీర్వదిస్తూ ముందుకు సాగిపోయాడు.

కొన్ని నెలల తరువాత కబీర్‌దాసు మరలా అదే వీధికి భిక్షాటనకు వచ్చి, దేవదాసి ఇంటి ముందు ఆగాడు. రాజభోగాలతో రాజిల్లిన ఆ భవనం నేడు బూజుపట్టి బోసిపోయి కనిపించింది; ఎంత పిలిచినా ఎవ్వరూ బయటకు రాలేదు. అలా ముందుకు వెళుతూ ఆ రామభక్తుడు స్మశానం ముందు నిలబడి దూరంగా కట్టెలపై సగం కాలి పడి ఉన్న ఓ శవాన్ని చూస్తూ ఉన్నాడు. అంతకుముందు రోజే దీర్ఘవ్యాధితో కన్నుమూసిన దేవదాసి దేహమది అని ఎవరో చెప్పారు. క్షణాల్లో ఓ కాకి వచ్చి, ఆ దాసి కపాలంపై వాలింది. అప్పుడు కబీర్‌కు తను గతంలో చూసిన ఆమె కళ్ళు స్ఫురించాయి. 'అయ్యో! నాడు కాటుకతో కళకళలాడి, హొయలు కురిపించిన ఆ కళ్ళు ఏమయ్యాయి? కపాలంలో గుంటలుగా మారాయి. నేడు అదే కనుదోయిపై కాకులు వాలి కావ్ కావ్ మంటున్నాయి; భోగాలేవీ శాశ్వతం 'కావు కావు' అని హెచ్చరిస్తున్నాయి' అనుకుంటూ మరో ఊరికి పయనమయ్యాడు. జగద్గురువులు ఆదిశంకరాచార్యులు 'భజ గోవిందం' ముగింపు శ్లోకాలను వల్లిస్తూ ....





**సుఖతః శ్రీయతే రామాభోగః పశ్చార్ధస్త శరీరే రోగః ।**

**యద్య లోకే మరణం శరణం తదివ్ న ముంచిత్ పాపాచరణమ్ ॥**

“సుఖాన్ని ఆశించి మానవులు ఇంద్రియలోలురవుతారు. దానివల్ల శరీరం రోగాలతో నిండిపోతుంది. లోకంలో మానవులకు మరణమే చివరకు శరణమైనా పాపాలు చేయడం మాత్రం మానర”ని ఆందోళనపడ్డారు.

**అనుభవాలకు అద్దెలు :** ఈ లోకంలో ఏ భోగాన్ని అనుభవించినా దాని విలువను ఏదో ఒక రుగ్మత రూపంలో చెల్లించాల్సిందే! ఇంద్రియాలను ఇష్టారాజ్యంగా సంతృప్తిపరచుకుంటూ పోతే పర్యవసాన ఫలితాలను భరించాల్సిందే! అగ్నికి ఆజ్యం పోసి ఆర్పాలనుకోవడం ఎంత అవివేకమో, కోరిందల్లా ఇచ్చి మనస్సును సంతృప్తిపరచాలనుకోవడం కూడా అంతే అవివేకం. అయితే నేడు నయనాల నుంచి నాలుక వరకు ఏ ఒక్క ఇంద్రియాన్ని కూడా నియంత్రించుకోలేని నిస్సహాయస్థితికి వచ్చేశాం. అందుకే అవసరం లేకపోయినా కంటికి కావాలని అనిపించిందల్లా తెచ్చి, ఇంట్లో పడేస్తున్నాం; తిని అరగించుకొనే శక్తి లేకపోయినా జిహ్వాచాపల్యంతో పళ్లెంలోని పదార్థాలన్నింటినీ కడుపులోకి తోసేస్తున్నాం. చివరకు అప్పుల పాలే కాకుండా ఆసుపత్రుల పాలౌవుతున్నాం. అందుకే ప్రహ్లాదుడు తన మిత్రులతో ....

**... కాముకులు కరద్వయ కండూతి చేతం తనియని చందంబున**
**తుచ్ఛంబయి పశుపక్షి క్రిమికీట సామాన్యం బయిన మైథునాది**
**గృహమేధి సుఖంబులం తనియక కడపట అతి దుఃఖవంతులగు దురు....**

'రెండు చేతులతోటి గోకుకొని కూడా తృప్తి చెందనట్లు కాముకులు తుచ్ఛమైన పశుపక్ష్యాదులకూ, క్రిమికీటకాదులకూ సామాన్యమైన మైథునాది గృహస్థ సుఖాలలో మునిగి సంతృప్తి చెందక చివరకు దుఃఖభాగులవుతార'ని స్పష్టం చేస్తాడు.

అప్పడప్పుడు ఆసుపత్రులను సందర్శించి రోగాలతో మంచాల్లో అవస్థలు పడుతున్న వారిని చూసి వస్తూ ఉండాలి. ఈ శరీరాన్ని అదుపులో పెట్టుకోకపోతే ఎన్ని అవస్థలు పడాల్సి వస్తుందో అప్పుడు అర్థమవుతుంది.

**శరీరమే సాధనం :** ఈ ప్రపంచంలో మనం ఏం సాధించడానికైనా ఆరోగ్యకరమైన శరీరమే ప్రధాన సాధనం. అందుకే 'శరీరమాద్యం ఖలు ధర్మసాధనం' అంటారు. అలాంటి దేహాన్ని భోగాలకే పరిమితం చేసి, పాపాల పుట్టగా మార్చేస్తే, అదే మన పురోగతికి ప్రతిబంధకమవుతుంది. భౌతిక పరమైన వాంఛలను మనం ఎంత తగ్గించుకుంటే, బుద్ధికి అంత శక్తి, సంకల్ప బలం పెరుగుతాయి. కేవలం దేహపరమైన సంరక్షణకూ, కాంక్ష లకే మన మనస్సును పరిమితం చేస్తూ పోతే, ఉన్నతమైన విషయాలవైపు దృష్టి మరలదు. అయితే ఆధునిక జీవనంలో మనిషి తాపత్రయానికి అడ్డూ అదుపూ లేకుండా పోతోంది; తనువుకు ఇచ్చే ప్రాధాన్యాన్ని చూస్తూ ఉంటే ఆశ్చర్యమేస్తోంది. అలా అని దాన్ని శుష్కింపజేసి, కళ్లను, కాళ్లను నిర్బంధంగా కట్టడి చేయమని శంకరాచార్యులు కోరడం లేదు. కానీ, వాటికి ఎంత అవసరమో, అంత సంతృప్తిపరిస్తే చాలన్నదే వారి ఉద్దేశం. అందుకే గౌతమ బుద్ధుడు కూడా లౌకికులతో 'పూర్తి వైరాగ్యమూ వద్దు, పూర్తి లోలత్వమూ వద్దు. ఇంద్రియాలు చెప్పిందంతా వినకండి. అలాగని అడిగినదేదీ ఇవ్వకుండా వాటిని ఆకలితో మాడ్చకండి. మీ స్నేహితులుగా, సహచరులుగా మెలిగేలా వాటికి శిక్షణనివ్వండి; ఇదే మధ్యే మార్గం' అంటారు. ఇంద్రియ సుఖాలను ఎంత పెంచుకుంటే ఈ ప్రపంచానికి మనం అంత దాస్యం చేయాల్సి ఉంటుంది. బానిసగా అష్టైశ్వర్యాలు అనుభవించే కన్నా, స్వతంత్రంగా బిచ్చమెత్తుకొని జీవించినా చాలు! కానీ ఈ రోజుల్లో భోగ భాగ్యాల వ్యామోహంలో ఆధునిక మానవుడి బతుకు బానిసల కన్నా హీనంగా మారిపోయింది.





**సరళ జీవనం :** మనకు ఎన్ని భోగవస్తువులు ఉంటే అంత ఆధునికులం, నాగరికులమనుకునే భ్రమల్లో ఉన్నాం. అందుకే మన నిత్యావసర వస్తువుల జాబితా నానాటికీ పెరిగిపోతోంది. ముఖ్యంగా మన ఉనికిని మనం సము పార్జించుకున్న విషయవస్తువులే విపరీతంగా ప్రభావితం చేస్తున్నాయి. అవి లేకపోతే మన ప్రాణాలు పోతాయేమో అనిపించేంతగా మనం వాటికి అలవాటు పడిపోయాం. 'చుట్టూ భోగవస్తువుల మధ్య జీవించినప్పుడు వాటిని అనుభవించడానికి అనువైన మార్గాలు ఉత్పన్నమవుతాయి' అంటారు దివ్యజనని శ్రీశారదామాత. అందుకే ఆ అమ్మ మనం ఊహించ నైనా ఊహించలేనన్ని అతి తక్కువ అవసరాలతో భౌతిక జీవనాన్ని గడిపి తన అవతారాన్ని చాలించారు. వస్త్రాల నుంచి విహారాల వరకు వీలైనంత మేరకు అలా నిరాడంబరతకే ప్రాధాన్యం ఇవ్వాలి. అప్పుడు అవసరాల పేరుతో అతిగా ఆర్జించాల్సిన ... అడ్డదారులు తొక్కాల్సిన అవసరం రాదు. డాంబికమైన జీవనశైలే చాలామంది అవినీతి కార్యకలాపాలకు పాల్పడ టానికి ప్రధాన కారణం. అదే భావంతో వేమన ...

**నీళ్ళలోని మీను నెరిమాంస మాశించి**
**గాలమందు చిక్కు కరణి భువిని**
**ఆశ తగిలి నరుడు నాలాగు చెడిపోవు**

**విశ్వదాభి రామ వినుర వేమ ....**

'నీటిలోని చేప ఎరగా వేసిన మాంసపు ముక్క కోసం ఆశతో గాలంలో చిక్కుకుంటుంది. అదే విధంగా భోగాలను ఆశించిన మానవుడు ఆశల గాలానికి చిక్కుకొని దానిలోనే జీవితాన్ని వెళ్లబుచ్చుతూ కష్టాల పాలవు తున్నాడ'ని హెచ్చరిస్తారు.

**మరణమే శరణం ... :** మనకు నిరంతరం ఆ సర్వేశ్వరుడి రూపంతోపాటు స్మశానం కూడా మనస్సులో మెదలుతూ ఉండాలి. క్షణం తీరిక లేకుండా కార్లలో తిరిగి... కడుపులు కొట్టి కోట్లకు కోట్లు సంపాదించి... కీర్తి ప్రతిష్ఠలతో

కళ్ళు తలకెక్కి ... ఎంత మిడిసిపడ్డా మనమందరమూ చేరుకునేది ఆ మరుభూమికేనని మరచిపోవద్దు. అందుకే 'స్మశానవాటిక' కవితా ఖండికలో

**ఇచ్చోటనే సత్కవీంద్రుని కమ్మని కలము నిప్పలలోనే కరిగిపోయె**
**ఇచ్చోటనే భూములేలు రాజన్యులు యధికారముద్రిక లంతరించె**
**ఇచ్చోటనే లేత ఇల్లాలి నల్లపూసల సౌరు గంగలో కలసిపోయె**
**ఇచ్చోటనే యెట్టి పేరెన్నికం గన్న చిత్రలేఖకుని కుంచెయు నశించె**
**యిది పిశాచులతో నిటాలేక్షణుండు**
**గజ్జె కదలించి యాడు రంగస్థలంబు**
**ఇది మరణదూత తీక్ష్ణమౌ దృష్టులొలయ**
**నవని పాలించు భస్మ సింహాసనంబు ...**

అంటారు మహాకవి గుర్రం జాషువా గారు. అయితే మాధవుడి మాయ ఏమిటోగాని మనమందరమూ, మరణమంటే మనకు సంబంధం లేని విషయమన్నట్లుగా ప్రవర్తిస్తూ ఉంటాం. పక్క ఇంట్లో దొంగలు పడితే, మన ఇంట్లో కూడా పడతారేమోనని, ముందు జాగ్రత్తగా తుప్పపట్టిన తాళాలను బాగుచేసుకొని, పకడ్బందీ ఏర్పాట్లన్నీ చేసుకుంటాం. కానీ పక్క ఇంట్లో ప్రాణాలు పోతే, మనవి కూడా ఎప్పుడో ఒకప్పుడు పోతాయనీ, పాపపు పనులు మానుకొని, తప్పులు సరిదిద్దుకొని, పుణ్యకార్యాల కోసం ప్రయత్నించం. పైగా అంతిమ ఘడియల గురించి ఆలోచిస్తే అపచారం అన్నట్లుగా, ఆ విషయాన్ని దాటవేస్తూ ఉంటాం. కానీ, మరణాన్ని మననం చేసుకుంటూ ఉంటే మన నడక తడబడదు; అహంకారం అంకురించదు. అందుకే కొన్ని మత సంప్రదాయాల్లో ఏటా స్మశానానికి వెళ్ళి, అక్కడ తమ ఆత్మీయుల సమాధులను అలంకరించి, సమీపంలో బీదసాదలకు దాన ధర్మాలు చేసి పెద్ద ఉత్సవాన్ని నిర్వహిస్తారు. అలా మనందరి ఏకైక గమ్య స్థానం కూడా అదేనని మరచిపోకుండా మసలుకోవాలి.





# మాతృసంస్థ కబుర్లు

ఆగస్టు 24 శ్రీ కృష్ణాష్టమి. ఈ సంవత్సరం కృష్ణాష్టమి వేడుకలు సాయిధామంలో అంగరంగ వైభవంగా జరిగాయి. ప్రశాంతి వానప్రస్థలో ఉంటున్న కమలమ్మగారు (80 సం.లు) కృష్ణ భక్తురాలు. ప్రతి నిత్యం ఆయన స్మరణలోనే గడుపుతారు. ఆశ్రమవాసులందరికీ నూతన వస్త్రాలు అందించారు. కృష్ణునికి కావలసిన ప్రసాదాలు, అలంకరణ సామాగ్రితో దేవాలయం ఎంతో సుందరంగా అలంకరించారు. వారి కుటుంబ సభ్యులు పూజకు కూర్చోగా శ్రీ సాయిరామ చైతన్యగారు మంత్రోచ్చారణతో పూజ ప్రారంభించారు. కృష్ణుని అవతార రహస్యాన్ని గూర్చి వివరంగా భక్తులకు సాయిరామ చైతన్యగారు వివరించారు. శ్రీసాయి విద్యా ధామం బాలికలు గోపికా, కృష్ణుని వేషాలతో, నృత్యాలను చేసి వచ్చిన వక్తలను ఆనంద పారవశ్యంలో నింపేశారు. ముఖ్యంగా కృష్ణుని వేషం వేసిన చి॥ మేఘన (3వ తరగతి) అందరి మన్ననలను పొందింది.

మధ్యాహ్నం 3 గం.లకు సాయి విద్యాధామం పాఠశాల విద్యార్థులచే ఉట్టి కొట్టే కార్యక్రమం ఎంతో సందడిగా జరిగింది. అనంతరం ప్రసాదాన్ని స్వీకరించి భక్తులు, పిల్లలు తరలివెళ్ళారు.

సాయంత్రం రామలింగంపల్లి గ్రామంలో శ్రావణ శుక్రవారం సందర్భంగా చి॥ హేమంతరెడ్డి, ఉజ్వల ఆధ్వర్యంలో 108 మంది ముత్తె దువులతో శ్రీ సాయిరామ చైతన్యగారు వరలక్ష్మీ వ్రతం చేయించారు. ఊరి వారంతా ఎంతో ఐకమత్యంతో, ఉత్సాహంతో, భక్తిశ్రద్ధలతో పూజలో పాల్గొన్నారు. వరాలనిచ్చే ఆ వరలక్ష్మీ దేవి యొక్క కరుణా కటాక్షాలు కలగా లంటే ప్రవర్తనా విధానం ఎలా ఉండాలో సాయిరామ చైతన్యగారు వివరిం చారు. చి॥ హేమంతరెడ్డి, ఉజ్వల కుటుంబ సభ్యులు ఊరి వారందరికీ భోజన ఏర్పాట్లు కూడా చేసారు.

ప్రతి సంవత్సరం యిలానే మీ గ్రామమంతా వరలక్ష్మీదేవి వ్రతం చేసు

కొని సిరిసంపదలతో, అష్టఐశ్వర్యాలతో కలకాలం వెలుగొందాలని స్వామీజీ వారి, బాబా వారి ఆశీస్సులు ఎల్లప్పడూ ఉండాలని సాయివాణి కోరుకుంటుంది.

విఘ్నాలకు అధిపతి అయిన విఘ్నేశ్వరుని పూజ చెయ్యటం అంటే అందరికీ ఎంతో ఉత్సాహం, ఆనందం, ఆశ్రమంలో పిల్లలందరూ ఒక పెద్ద పెద్ద వినాయకుడిని, ఎవరికి వారు చిన్న చిన్న రకరకాల వినాయకులను తయారుచేసుకున్నారు ముందురోజు రాత్రే. సెప్టెంబర్ 2 మాఘశుద్ధ చవితి. ఉదయాన్నే పత్రాలు, ఫలాలు సేకరించడం, అలంకరించటంలో మగ పిల్లలు మునిగిపోగా, ఆడపిల్లలందరూ ప్రసాదాలు చెయ్యటంలో నిమగ్నమై 10 గం.లకల్లా పూర్తిచేసి 10.30కి పూజ ప్రారంభించారు. వినాయకుడు విఘ్నాలకు అధిపతి అయిన విధానాన్ని, వ్రత కథను శ్రీ సాయిరామ చైతన్య గారు వివరించారు.

సెప్టెంబర్ 3వ తేదీ శ్రీ సాయిరామ చైతన్యగారు భక్తుల ఆహ్వానం మేరకు షిరిడీ యాత్రకు వెళ్ళారు. స్వామి వారి సన్నిధిలో జపసాధన నిమిత్తం మూడు రోజులు షిరిడీలో గడిపారు. 5వ తేదీ ఉదయం షిరిడీ సాయి నాథుని సన్నిధిలో శ్రీ సాయినాథ వ్రతం 142 మంది దంపతుల గోత్ర నామాలతో వ్రతం చేయడం, భక్తులంది మనోభీష్టం నెరవేరాలని విన్న వించడం ఎంతో ఆనందాన్ని, సంతృప్తిని కలిగించాయని శ్రీ సాయిరామ చైతన్యగారు ఉద్వేగంతో వివరించారు.

సెప్టెంబర్ 5వ తేదీ ఉపాధ్యాయ దినోత్సవం. శ్రీ సాయి విద్యాధామం 10వ తరగతి విద్యార్థులు ఉపాధ్యాయ వృత్తిని స్వీకరించి ఉపాధ్యాయు లకు ఆనందోత్సాహాలను నింపారు.


సాయిధామం సేవాశ్రమంలోని సంధ్య (అరక్షిత వృద్ధాశ్రమం) నివాసి అయిన శ్రీ బండారు రామకృష్ణగారు 13.09.2019 ఉదయం 5 గం.లకు గురుసన్నిధికి చేరిపోయినారు. వారి ఆత్మకు శాంతి కలగాలని ఆశ్రమ వాసులందరూ సాయినాథుని మనసారా ప్రార్థించారు.







# సాయిధామంలో దసరా



సాయిధామంలోని 'ద్వారవతి' సాయి దేవాలయంలో విజయదశమి సందర్భంగా క్రింది కార్యక్రమాలు ఏర్పాటవు తున్నాయి. భక్తులందరూ కార్యక్రమాలలో పాల్గొని ధన్యులు కావలసిందిగా ఆహ్వానిస్తున్నాము.

మామూలు హారతులు, కార్యక్రమాలు కాక ఇవి విశేషం :

| | | |
|---|---|---|
| **5.10.2019** | ఉ. 10 గం. | సరస్వతీ పూజ |
| **శనివారం** | మ. 12 గం. | మహా హారతి |
| | సా. 6 గం. | సాయంకాల హారతి |
| **6.10.2019** | ఉ. 10 గం. | దుర్గాస్తుతి, సాయిచాలీసా పారాయణ |
| **ఆదివారం** | మ. 12 గం. | మహా హారతి |
| | సా. 6 గం. | సాయంకాల హారతి |
| **7.10.2019** | ఉ. 10 గం. | మారేడుదళాలతో విశేష పూజ, |
| **సోమవారం** | | ఆయుధ పూజ, సాయి సంకీర్తన |
| | మ. 12 గం. | మహా హారతి |
| | సా. 6 గం. | సాయంకాల హారతి |
| **8.10.2019** | | విజయదశమి |
| **మంగళవారం** | ఉ. 6 గం. | సాయినాథుల వారికి క్షీరాభిషేకం |
| | ఉ. 8 గం. | అష్టోత్తర నామ పూజ |
| | ఉ. 10 గం. | వివిధ పుష్పాలతో సహస్ర నామార్చన |
| | మ. 12 గం. | మహా హారతి |
| | సా. 6 గం. | శమీపూజ, దర్శనం |
| **9.10.2019** | ఉ. 8 గం. | సాయినాథుల వారికి పూజ |
| **బుధ వారం** | ఉ. 10 గం. | సమాధి పూజ, దీపాలతో, పూలతో సాయి తనవు చాలించిన అధ్యా యాలు పారాయణ, ప్రదక్షణ నమస్కారాలు. |
| | మ. 12 గం. | మహా హారతి, ప్రసాద వినిమయం |

**భక్తులందరికీ ఇదే ఆహ్వానం.**

**- ధర్మాధికారి**

# ఒక్కటి వదిలితే చాలు...

- మాతాజీ

శివన్న తాతతండ్రులంతా దొంగతనాలతోనే బ్రతికారు. వాళ్లలాగే శివన్న కూడా మాంచి నేర్పున్న దొంగ వీలైనంతవరకు ఎవర్నీ కొట్టకుండానే నేర్పుగా దొంగతనాలు చేస్తుంటాడు. అంతే నేర్పుగా ఎవ్వరికీ దొరక్కుండా బయటపడి పోతుంటాడు. పగలంతా అతనికేమీ పని ఉండదు. బారెడు ప్రొద్దెక్కేదాకా పడుకోవటం, లేచి హాయిగా తిని ఇంట్లో వాళ్లతో కాలక్షేపం చెయ్యటం, సాయంత్రం అవుతోంటే మిత్రులతో (తనలాటి జులాయిగాళ్లే వాళ్లూను) పేకాటడం, అదయ్యాక రాత్రి పొద్దుపోయేదాకా వేచి ఉండి, ఊరు సద్దుమణిగిందనుకొన్నాక ఇక తన వృత్తి పనుల మీద దిగటం-యిదీ అతని దినచర్య ఇలా నడుస్తూ ఉంది అతగాడి కథ. ఓ రోజు -

ఆవేళ శివన్నకేమీ పని దొరకలేదు. కారణం ఆ వేళ పూర్ణిమ కావటమే పూర్ణిమ-దీన్నే పౌర్ణమి, పున్నమి అంటారు-ఆ వేళ చంద్రుడు పదహారు కళలతో ప్రకాశిస్తుంటాడు. ఊరంతా పిండి ఆరబోసినట్లు తెల్లని, చల్లని వెన్నెల పరుచుకొని ఉంటుంది. (ఇలా మంచి వెన్నెల కళ్లారా చూచి ఆనందించే భాగ్యం మహానగరాలలో కరెంట్ దీపాల వెలుగుల్లో బ్రతికే వారికి దొరకదు. ఎప్పుడైనా ఊరు ఊరంతా ఒక్కసారిగా కరెంట్ పోతే తప్ప.) సరే-ఆ రోజు పూర్ణిమ గనుక-వెన్నెల్లో దొంగతనం చేస్తే పట్టుపడిపోయే అవకాశాలు ఎక్కువ. అంచేత శివన్నకు ఆ వేళ సెలవురోజన్నమాట.

ఆ రాత్రి శివన్న భార్య శ్రీరాముడి గుడికి వెళ్లి దణ్ణం పెట్టుకొని వద్దామన్నది. సరేనని ఇంట్లో అంతా గుడికి వెళ్లి పూజలు చేయించుకొన్నారు. ప్రసాదం తీసుకొని, బయటికి వచ్చేస్తోంటే ప్రక్కన మంటపంలో పంతులు గారు పురాణం చెప్పటం వినిపించింది. శివన్న భార్య "అక్కడ కాస్సేపు కూర్చొని విందామండీ?" అన్నది. ఆ రోజుల్లో రైతులకు, శ్రమపడి బ్రతికే కూలీలకు, చాకలి, కమ్మరి, కుమ్మరి, వడ్రంగి, మేదరి, కంచరి వంటి





కుల వృత్తుల మీద బ్రతికే వారికి ఏదో అక్షరజ్ఞానమే తప్ప పెద్దపెద్ద చదువులు చదివి ధర్మం, శాస్త్రం తెలుసుకోగల అవకాశం ఉండేది కాదు. మరి అలాటి వాళ్లకు అన్ని విషయాలు తెలిసేదెలాగ? హరికథలు, బుర్రకథలు, పురాణాలు, నాటకాలు, భజనలు-యిలాటి వాటి ద్వారా రామాయణ భారత భాగవతాలు, మహనీయుల కథలు చెప్పేవారు చదివిన వారు.

విన్న వారందరికీ అక్షరజ్ఞానం లేకపోయినా అర్థజ్ఞానం ఉండేది. (ఇప్పుడు మనకేమో అర్థజ్ఞానం లేని వ్యర్థపు చదువులు వస్తున్నాయి- అది వేరే కథ) సరే. మన శివన్నా వాళ్లు వెళ్లేసరికి ఆయన జైమిని భారతంలోని కథేదో చెప్తున్నారు. ఆ కథ మధ్యలో ఆయన నరకం అంటే ఏమిటో, స్వర్గం అంటే ఏమిటో వివరించారు. ఏయే పాపాలు చేస్తే ఎలాటి శిక్షలు నరకంలో వేస్తారో అని తప్పించుకోవాలంటే ఎలా జీవించాలో చెప్తున్నారు. అన్నీ శ్రద్ధగా విన్నాడు. శివన్న ఇంటికి వచ్చి పడుకొన్నాగానీ అతనికి నిద్ర పట్టలేదు. తానెన్నో పాపాలు చేసాడు. వాటన్నిటికీ ఎన్ని భయంకరమైన శిక్షలు పడతాయో ఊహించుకొని వణికిపోయాడు. కలలో కూడా యమ భటులు తనను నానాహింసలూ పెడుతున్నట్లు కనిపించేసరికి ఉలిక్కిపడి లేచి కూర్చున్నాడు.

మర్నాటి ఉదయం శివన్న మళ్లీ రామాలయానికి వెళ్లాడు. పురాణం చెప్పే పంతులుగారు మంటపంలో కూర్చొని జపం చేసుకుంటున్నారు. శివన్న వెళ్లి ఆయన కాళ్లకు నమస్కారం చేసాడు. పద్మాసనంలో కూర్చొని "స్వామీ, రాత్రి మీరు చెప్పిన కథ విన్నాను. నరకంలో పడకుండా ఉండాలంటే నన్నేం చేయమంటారో సెలవివ్వండి" అని వినయంగా అడిగాడు. పంతులుగారు "నాయనా నువ్వు ఏమేం పాపాలు చేసావో ముందు చెప్పు" అన్నారు. శివన్న తలవంచుకొని అయ్యా నా వృత్తి దొంగతనం. పగలు ఆ పని చెయ్యలేను గనుక కాలక్షేపానికి పేకాడతాను. సాయంత్రం పూట తాగుతాను. దొంగతనంలో ఏదైనా అవకతవకలొస్తే, అవతలి వాడిని రెండు

ఉతుకుతాను. పట్టుబడవలసి వస్తే తప్పించుకోవడానికి అబద్ధాలాడతాను" అన్నాడు. "ఇవన్నీ తప్పులని నీకు తెలుసు గదా" అడిగాడు పంతులుగారు. శివన్న తలూపాడు. "బాబూ! పాపాలన్నవి ఒక్కటొక్కడిగా విడివిడిగా ఉండవు. ఒకదానికొకటి ముడులు పడి పూలదండలాగా, పోనీ ఇనుప గొలుసులాగా ఉంటాయి. ఎక్కడన్నా ఒక్క ముడి, మెలిక ఊడితే చాలు-మిగతావన్నీ వాటంతట అవే ఊడిపోతాయి. అందుచేత నీవు చేసే వాటిలో ఏదో ఒక్క తప్ప మానివెయ్యి మిగిలినవన్నీను అవే పోతాయి" అన్నాడు. శివన్న కొంచెంసేపు ఆలోచించి, "సరే, స్వామీ ఈ క్షణం నుంచీ నేను అబద్ధం ఆడను ప్రాణం పోయినా సరే"-అన్నాడు. "ఆ మాట ఆ కోదండ రాముడి ముందు ప్రమాణం చేసి చెప్ప బాబూ! అబద్ధం వెనుక ఒక్కటొక్కటిగా ఈ దురలవాట్లన్నీ పోతాయి. ఇక మీదట పాపకర్మలు నీ వెంట రావు" అని ఆశీర్వదించారు పంతులుగారు. రామనామం ఉపదేశించారు కూడా.

శివన్న పదిరోజులపాటు ఇంటిపట్టునే ఉండిపోయాడు-రామ నామం జపిస్తూ పొరపాటున కూడా అసత్యం పలక్కుండా జాగ్రత్తపడుతున్నాడు. పాత మిత్రులను కలవడం లేదు. ఆ రోజు బహుళ ఏకాదశి. అమావాస్య రోజులు గనుక చీకట్లు గాఢంగా (నల్లగా) అలుముకున్నాయి. శివన్న తన చోరవస్తువులతో అర్ధరాత్రి వేళ బయటకు వచ్చాడు. గత పదిరోజులుగా దైవధ్యానంలో ఉన్న తరువాత అతనికి దొంగతనానికి వెళ్లాలంటే కొంచెం బాధగా, సంకోచంగా అనిపించింది. ఒకచోట నిలబడి ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాడు. ఇక మీదట కానీ చిల్లరచిల్లర దొంగతనాలు మానుకోవాలి. చివరిసారిగా యివ్వేళ ఏదైనా పెద్ద ఇంటికి కన్నం వేస్తే మరి వేరే వాటికి వెళ్లనక్కరలేదు. ఏదో పెద్ద ఇంటికి దేనికీ-రాజుగారి ఖజానాకే ఎసరు పెడితే సరి! ఈ ఆలోచనతో వాడు అర్ధరాత్రి వేళకు ఖజానా-అంటే రాజుగారి డబ్బు, రత్నాలు, వజ్రాలు, బంగారంలాంటివన్నీ





ఉండే కోశాగారం వీధికి చేరుకున్నాడు.

ఆ పరిసరాలలోనే శివన్నకు ఓ వ్యక్తి తారసపడ్డాడు. అతను శివన్న దగ్గరకు వచ్చి, తాను ఆ ఊరికి కొత్తవాడిననీ, తనను కూడా శివన్నతోపాటు ఉండనిమ్మనీ తనక్కూడా ఏదైనా పని చూపించమనీ బ్రతిమాలుకున్నాడు. నిలవనీడ కూడా లేక తానలా వీధులు పట్టుకు తిరుగుతున్నానని మొర పెట్టుకున్నాడు. శివన్నకు జాలివేసింది. "నేను దొంగతనానికి వెడుతున్నాను. నాకు తోడుగా రా. దొరికింది చెరి సగం పంచుకొందాం. దానితో ఏదైనా చేసుకొని బ్రతుకుదువుగాని" అన్నాడు. సరేనన్నాడు క్రొత్త వ్యక్తి.

శివన్న కాపలావాళ్ల కంటబడకుండా ఒడుపుగా ఖజానా వెనకవైపున్న చిన్న గుమ్మం దగ్గరకు వెళ్లాడు. చాలా నేర్పుగా కన్నం తవ్వాడు తన అనుచరుడి సహాయంతో. "నీవు ఇక్కడే నిలబడి ఉండు. ఎవరైనా వస్తున్నట్లనిపిస్తే నాకు ఈల వేసి చెప్పి, నువ్వు పారిపో! నేను లోపలికి వెళ్లి చూస్తాను. ఏం దొరికితే అది చెరి సగంగా పంచుకుందాం" అని చెప్పి శివన్న కన్నం గుండా దూరి లోపలికి వెళ్లిపోయాడు. అతను ఒక పావు గంట తరువాత బయటికి వచ్చి తన సహచరుడిని తనతో రమ్మని సైగ చేసి నిశ్శబ్దంగా కోటలో నుంచీ బయటకు వచ్చేసాడు. తాను తెచ్చిన రెండు మేలిమి జాతికి చెందిన మణులలో ఒకటి క్రొత్త దొంగకిచ్చి రెండవది తాను తీసుకున్నాడు. "మంచిది మిత్రమా, మరి నేను వచ్చిన పని అయిపోయింది. ఈ మణి కనీసం లక్ష రూపాయలు పలుకుతుంది. నేనింక దొంగతనం చేసే అవసరం ఉండదు. నీవు కూడా ఇక మానేసి హాయిగా ఉండు" అన్నాడు కూడా. క్రొత్త దొంగ శివన్నకు కృతజ్ఞతలు చెప్పి "ఎప్పుడన్నా నిన్ను చూడాలనిపిస్తే వస్తాన"ని శివన్న యిల్లెక్కడో అడిగి తెలుసుకున్నాడు. ఎవరి దారిన వాళ్లు వెళ్లిపోయారు.

మరునాటి ప్రొద్దున పది గంటలకు రాజభటులు శివన్నను బంధించి రాజస్థానానికి తీసుకువెళ్లారు. శివన్న తన మనసులో భగవంతుడికీ, తనకు

బోధ చేసిన అయ్యవారినీ (గురువునూ) తలుచుకొని నమస్కారం చేసు కున్నాడు. క్రితం రాత్రి తనకు తోడుగా వచ్చిన దొంగ పట్టుబడి ఉంటాడనీ, అతడే తన ఆచూకీ కూడా చెప్పి వుంటాడనీ ఊహించగలిగాడతను. అందుకే తాను ఖజానా నుంచి దొంగిలించిన మణిని పంచె కొంగున దాచుకుని మరీ బయలుదేరాడు రాజభటులతో.

కొలువుతీరిన రాజుగారు మంత్రిగారికి సైగ చెయ్యగానే ఆయన శివన్నను నిన్నరాత్రి నీవు ఎక్కడున్నావు? అని అడిగారు. శివన్న ఒక్కక్షణం తటాపటాయించి "నగరంలోనే ఉన్నాను స్వామీ!" అన్నాడు. "అర్ధరాత్రి వేళ నగరంలో ఎక్కడున్నావు? ఏమి చేసావు?" శివన్న ధైర్యంగా చెప్పేసాడు. "రాజుగారి ఖజానాలోకి వెళ్లాను-రెండు మణులు దొంగిలించుకొని వెళ్లాను". "రెండు కాదు-మూడు మణులు మహామంత్రీ" కోశాధికారి మధ్య లోనే కల్పించుకొని అన్నాడు. "దీనికేమంటావు?" మంత్రి ప్రశ్న. "లేదు స్వామీ! నేను రెండే తీసుకున్నాను. అందులో మూడు మణులున్నమాట నిజమే. కానీ నాతోపాటు దొంగతనానికి వచ్చిన వారింకొకరున్నారు. మూడవది తీసుకుంటే చెరి సగం తీసుకోవటం కష్టమవుతుందని-మూడ వది అక్కడ ఉంచేసాము. మేము చెరి ఒకటి పంచుకున్నాం" అన్నాడు శివన్న.

"రెండు నీవు ఉంచుకొని, ఒకటి అతనికిచ్చావేమో!" అన్నాడు మహా మంత్రి. శివన్న చేతులు రెండూ జోడించి నమస్కరించాడు. "అయ్యా! నేను దొంగనే. కానీ అబద్ధం అన్న దుర్గణం వదిలివెయ్యమని గురువుల వారు చెప్పాక- నేను ఎన్నడూ అబద్ధం ఆడలేదు-ఆడను కూడా. నా మాట నమ్మండి స్వామీ! ఇదుగో నా వాటాకు తీసుకున్న మణి నా దగ్గరే ఉంది. చిత్తగించండి"-అంటూ పంచెకొంగున ఉన్న మణి తీసి చూపించాడు.

"నీతోపాటు దొంగతనానికి వచ్చిన మరో దొంగ ఎక్కడుంటాడో తెలుసా నీకు!" ఈసారి రాజుగారు ప్రశ్నించారు. "ఆయన నాకు కొత్తగా కలిసిన మిత్రుడు మహాప్రభూ! ఎక్కడుండేది నాకు తెలియదు" అన్నాడు





శివన్న వినయంగా. "పోనీ, నీవు అతనికిచ్చిన రెండవ మణిని గుర్తు పట్ట గలవా? ఇదేనా?" అని ప్రశ్నించాడు మహారాజు. శివన్న ఒక్కడుగు ముందుకు వేసి చూచి "ఆఁ! యిదే ప్రభూ! రాత్రి-తమరేనా!" అన్నాడు వణుకుతున్న గొంతుతో.

మహారాజు చిరునవ్వు నవ్వారు. సభలోని వారినొక్కసారి కలయ జూచి యిలా చెప్పారు.

"రాత్రి నేను మారువేషంతో నగర సంచారం చేస్తూ యీ శివన్నకు కలిసాను. ఇద్దరం కలిసి దొంగతనం చేసాము. చెరో మణి తీసుకుని విడి పోయాం. వేకువజామున నేను ఖజానాకు వెళ్లి చూచినప్పుడు మూడవ మణి అక్కడే ఉంది. శివన్న నిజాయితీ మీద నమ్మకం ఏర్పడింది. మణిని అలాగే వదిలేసి వచ్చాను. తెల్లవారాక కోశాధికారి పనిలోకి వచ్చి చూచి, రాత్రి దొంగలెవరో మూడు మణులూ ఎత్తుకుపోయారని నాతో చెప్పాడు. శివన్నను పట్టి తెప్పించాను. తరువాతి కథంతా మీరంతా చూచి నదే. ఎంతో ఉన్నతమైన పదవిలో ఉండి కూడా రాజద్రోహానికి ఒడిగట్టిన కోశాధికారిని ఆ పదవి నుండీ తొలగిస్తున్నాము. అతని దగ్గర ఉన్న మూడవ మణిని వెంటనే ఖజానాకు జమచెయ్యాలి. వృత్తికి దొంగయినా-గురువు కిచ్చిన మాట ప్రకారం మంచివాడుగా మారడానికి సిద్ధమైన శివన్నను క్రొత్త కోశాధికారిగా నియమిస్తున్నాను" మహారాజు ప్రకటన వినగానే ప్రజలంతా ఆనందంతో చప్పట్లు కొట్టారు. మరునాటి నుండీ -

శివన్న కోశాధికారి. గౌరవనీయులైన పదవిలో ఉన్నాడు గనుక పేకాట, జూదంలాంటి వ్యసనాలు వదిలిపోయాయి. చేతినిండా జీతం ఉంటుంది గనుక దొంగతనాలు లేవు. అవి లేవు. గనుక కొట్టడాలు, చంపడాలూ లేవు. శివన్న ఒక యోగ్యుడైన మంచిపౌరుడిగా తయారై మహారాజుతోనే గాక అందరితోనూ "భేష్!" అనిపించుకున్నాడు. 'ఒక్క దుర్గుణం మనం పట్టుదలతో వదిలేస్తే- మిగతావి అనే వదిలేస్తాయి అన్న గురువు మాట నిజమైంది.